ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 19 డిసెంబరు 2024





గజగజ

మర్పల్లిలో 8.6, కాస్లాబాద్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రోజుల నుంచి చలి చంపేస్తుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. బుధవారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యల్పంగా 8.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం కాస్లాబాద్‌లో 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 11.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

'మనీ హంట్' యూట్యూబర్ అరెస్టు

ఘట్‌కేసర్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): అవుటర్ రింగ్‌రోడ్డుపై మనీ హంట్ ఛాలెంజ్ పేరుతో డబ్బులు వెదజల్లుతూ న్యూసెన్స్ క్రియేట్ చేసిన యూట్యూబర్ బానుచందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి బుధవారం ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. బాలానగర్‌కు చెందిన రాయలాపురం బానుచందర్ అనే వ్యక్తి ఘట్‌కేసర్‌లోని అవుటర్ రింగ్‌రోడ్డుపై తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా వీడియో చిత్రీకరిస్తూ కరెన్సీ నోట్ల కట్టలను చెట్ల పొదల్లోకి విసిరివేస్తున్నట్లు సూచించాడు. ఆ డబ్బును ఎవరైనా తీసుకోవచ్చునని 'మనీ హంట్' చాలెంజ్ విసురుతున్నట్లు తెలిపారు. అవుటర్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు బానుచందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి సదరం క్యాంప్‌లు

తాండూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19నుంచి 24వ తేది వరకు అంగవైకల్యం గుర్తించేందుకు సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని వారు సూచించారు. వికారాబాద్ సిహెచ్‌సి సెంటర్‌లో 19 , 24 తేదిలలో అంగవైకల్యం (ఓహెచ్) కు దృష్టి లోపం ఉన్న వారికి, 21, 23,28, 30 తేదిలలో తాండూరు జిల్లా ఆస్పత్రిలో బుద్ధిమంద్యత, అంగవైకల్యం చెవిటి, మూగ వారికి క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకున్న వారు హాజరు కావాలని సూచించారు.



బహుమతులు అందజేస్తున్న విశ్వేశ్వర్

జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్ విజయవంతం

వికారాబాద్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ శివారెడ్డిపేట పాఠశాలలో తెలంగాణ జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జీవ శాస్త్ర టాలెంట్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జహంగీర్ , జీవశాస్త్ర ఫోరం అధ్యక్షులు బుచ్చిలింగం, జీవ శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సుమారు 80 మంది విద్యార్థులు హాజరైన ఈ పరీక్షలో జిల్లా స్థాయిలో ఆంగ్ల, తెలుగు మాధ్యమాలలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.



కొత్తగా మూడు పంచాయతీలు!

గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాండూరు మండలంలో 36కు చేరనున్న పంచాయతీలు

తాండూరు రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మండల పరిధిలో మరో మూడు నూతన పంచాయతీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. తాండూరు మండలంలో ఇప్పటికే 25 పంచాయతీలు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరో 8 పంచాయతీలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా గ్రామాల ప్రజలు అనుబంధ గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఆయా పల్లెలకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించి నివేదిక అందించాలని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేసింది.

500 జనాభాకుపైన ఉన్న గ్రామాలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 500 జనాభాపైన ఉన్న గ్రామాలను పంచాయతీలుగా మారిస్తే ప్రజలకు సేవలు అందుబాటులోకి వస్తాయనే ఉద్దేశంతోనే ఈ గ్రామాలను పంచాయతీల ఏర్పాటుకు అధికారులు వివరాలు సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే తాండూరు మండల పరిధిలోని కోణాపూర్, వడ్డెర బస్తీ, మైసమ్మగడ్డతండాలు నూతన పంచాయతీల ఏర్పాటు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ గ్రామాలు పంచాయతీలుగా ఏర్పడితే తాండూరు మండలంలో పంచాయతీల సంఖ్య 36కు చేరనుంది. ప్రస్తుతం తాండూరు మండల పరిధిలో పురుషులు 26,789, స్త్రీలు 26,872, మొత్తం జనాబా 53,661 మంది ఉన్నారు.



సర్పన్‌పల్లి చెరువులో అక్రమంగా బోటింగ్ కోసం నిర్మించిన కట్టడాలు

సర్పన్‌పల్లి చెరువు.. అక్రమాలకు అడ్డా!

లోపల మాత్రం అసాంఘిక కార్యకలాపాలు

- వీకెండ్స్ టార్గెట్‌గా నృత్యాలు, డ్రింక్స్ సప్లయ్
- లావణి భూముల్లో జరుగుతున్న వ్యవహారం
- చెరువు మధ్యలో అక్రమంగా బోటింగ్ కట్టడాలు
- అడ్వెంచర్ గేములు.. ప్రాణాలతో చెలగాటం
- స్థానిక నేతల అండదండలపై అనుమానాలు



అసైన్డ్ ల్యాండ్‌లో కొనసాగుతున్న రిసార్ట్

ఫామింగ్ పేరిట రిసార్ట్స్ నిర్వహణ

సర్పన్‌పల్లి చెరువు అక్రమార్కుల చేతుల్లో బందీ అయింది. సమీపంలో రిసార్ట్స్ పేరుతో గలీజు దందాకు తెరలేపారు. బయటకు మాత్రం ఆర్గానిక్ ఫామింగ్ చేస్తున్నామంటూ లోపల అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వీకెండ్‌లే టార్గెట్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను రప్పించి అశ్లీలతకు అడ్డాగా మారుస్తున్నారు. అలాగే చెరువు మధ్యలో బోటింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేసి కస్టమర్లను ఆకర్షిస్తూ లాభాలు గడిస్తున్నారు. దీనికి తోడు అడ్వెంచర్ గేమ్స్ పేరిట ప్రాణాలతో ఆడుకుంటున్నారు. ఐదేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నా అధికారులు ఎవరూ కన్నెత్తి చూడని దుస్థితి.

6

వికారాబాద్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిముక్కుల, సర్పన్‌పల్లి, గోధుమగూడ పరిధిలోని సర్పన్‌పల్లి చెరువును అడ్డాగా చేసుకొని అక్రమాలకు తెరలేపారు. సమీపంలోని గోధుమగూడ గ్రామానికి చెందిన కొందరు రైతులను మభ్యపెట్టి వారికి డబ్బు ఆశ చూపి లావణీ పట్టా భూముల్లో క్యాంపు సెట్ పేరుతో అక్రమంగా కట్టడాలు కట్టి వ్యాపారం చేస్తున్నారు. గోధుమగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 97లో దాదాపు 18 ఎకరాల లావణీ భూమి ఉంది. ఈ భూమిలో 10 నుంచి 15మంది రైతులు ఏళ్లుగా వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ దగ్గరగా ఉండడం వల్ల సరిగ్గా పంటలు పండక కేవలం కొంత మంది రైతులు మాత్రమే పంటలు వేస్తున్నారు. మిగిలిన వాళ్లు బీడు భూములుగా వదిలేశారు. ఇదే అదునుగా భావించిన ఆ బడా వ్యాపారి ఆ ప్రాంతంలో ఆయనకు కొంత పట్టా ల్యాండ్ ఉండడంతో అక్కడున్న 18 ఎకరాల అసైన్డ్ భూమిని ఆక్రమించుకొని అక్రమ వ్యాపారాలుక తెరలేపారు. చెరువు సమీప

మిగతా 8వ పేజీలో...

ఇళ్ల సర్వేకు నెట్ ఇబ్బందులు

- గ్రామాల్లో అందని సిగ్నల్
- ఆలస్యమవుతున్న వివరాల సేకరణ
- ఆందోళనలో పంచాయతీ కార్యదర్శులు

7



మూలనపడిన 'చెత్త' వాహనాలు

మరమ్మతులకు నోచుకోని వైనం

- మున్సిపాలిటీదే భారమంటున్న అధికారులు
- అయోమయంలో విలీన పంచాయతీ వాసులు

8



దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్
- భూ సమస్యల దరఖాస్తులు, ధరణి రికార్డుల పరిశీలన

7



ఘనంగా ప్రీ క్రిస్మస్



శామీర్‌పేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ చేతన ఆధ్వర్యంలో లెక్చరర్లు, విద్యార్థినులు కేక్ కట్ చేశారు. విద్యార్థినులు ఏసుక్రీస్తు పాటలు పాడగా, పలువురు నాటక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ వైస్‌ప్రిన్సిపాల్ స్రవంతి, కల్చరల్ కోఆర్డినేటర్లు దనవేణి, శిల్పారాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మిల్లు వద్ద పత్తి రైతుల ఆందోళన

ధారూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దళారులు తెచ్చిన పెద్దలోడుతో ఉన్న పత్తి వాహనాలను లోపలికి పంపిస్తూ రైతులు తెచ్చిన బండ్లను నిలిపివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన బుధవారం నాగసమందర్‌లో సాయిబాబా ఆగ్రో కమాడిటీస్ మిల్లు వద్ద జరిగింది. రైతులు తెచ్చిన పత్తిని కాంటా వేయకుండా దళారులు తెచ్చిన లారీలు, డీసీఎంలను తూకం వేశారు. సాయంత్రమైనా రైతుల పత్తిని తూకం వేయలేదు. దీంతో రోడ్డుపై రైతులు ఆందోళనకు దిగి నిర్వాహకులను నిలదీశారు. దళారులు, మిల్లు యాజమాన్యం కుమ్మక్కై తమ వాహనాలను తూకం వేయడం లేదని రైతులన్నారు. అలాగే మిల్లులోని అవకతవకలపై ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, అధికారులు పట్టించుకోవటం లేదని, సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థమైతలేదని రైతులు ఆవేదన వ్యక్తం చశారు.



నిరసనకు మద్దతు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

వికారాబాద్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ధారూరు, మోమిన్‌పేట మండల పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పే స్కేల్ అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా వారికి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దండు రమేశ్, నాగేశ్వర్ , ప్రభు, రాందాస్, సురేష్, బాబయ్య, నరేష్, మాణిక్యం, శివాని, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై పీడీ యాక్ట్ !

- హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు తర్వాత చర్యలు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 2024 జూలై కటాఫ్
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

7

'ఉద్యాన ఉత్సవ్'కు భారీగా ఏర్పాట్లు

రాష్ట్రపతి భవన్‌లో పలు రకాల స్టాల్స్ ● భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్‌కుమార్

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి తిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించడానికి సామాన్యులకు వీలు కల్పిస్తారు. ఈసారి మాత్రం ఉద్యాన్ ఉత్సవ్ పేరుతో సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రపతి నిలయంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేసి, ఒక పిక్నిక్ స్పాట్‌గా తయారు చేసి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్రికల్చర్ అథారిటీ ఇన్‌స్టూట్, సాంస్కృతిక టూరిజం శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక భౌగోళిక వ్యవసాయం, సమీకరణ వ్యవసాయంపై అవగాహన కల్పించేలా కుటీరాలను , స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. తమ తమ ఇళ్లల్లో నర్సరీ, గార్డనింగ్ ఎలా చేసుకోవాలో తెలిపేలా చిన్న చిన్న మెళకువలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. పిక్నిక్ స్పాట్‌లా ఉండేలా పిల్లలకు ప్లే ఏరియా ఉండేలా చూడాలన్నారు. ఉద్యాన ఉత్సవ్‌ను తిలకించేందుకు వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకురావాలన్నారు. అవసరమైన తాగునీరు,అంబులెన్స్ , మొబైల్ టాయిలెట్లు, రవాణా, లైటింగ్ వంటి మౌలిక వసతులను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ అగ్రికల్చర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రటరీ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, డీఈఓ విజయకుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్యుల్ ప్రవీణ్‌కుమార్

బషీరాబాద్‌లో నేరాలు తగ్గుముఖం

» ఎస్పీ నారాయణరెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాదితో పోలిస్తే నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డితో కలిసి ఆయన బషీరాబాద్ పీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ఆవరణలో మొక్కనాటారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఇక్కడ ఒక మర్డర్ కేసు కూడా నమోదు కాలేదని గుర్తు చేశారు. అనుమానాస్పద మరణాలు, అదృశ్యం కేసులు తగ్గిపోగా, చీటింగ్ కేసులు పెరిగాయన్నారు. అలాగే ఏటేటా వాహనాల సంఖ్యం పెరుగుతండటంతో, ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. కాగా, ప్రమాదాల నియంత్రణకు తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్‌లు చేపడుతున్నారన్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో అప్రమత్తంగా ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలిస్తూ కేసుల నమోదు, పురోగతిపై ఎస్ఐతో చర్చించారు. ఎస్పీ వెంట సీఐ నగేశ్ తదితరులున్నారు.



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఎస్ఐ శంకర్



పత్తికి తగ్గిన 'మద్దతు'

వికారాబాద్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో రకం బీబీ స్పెషల్ మోడ్ నుంఇ మెక్ మోడ్‌గా మారడం వల్ల సీసీఐ అధికారులు మద్దతు ధరను తగ్గిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం క్వింటాల్ పత్తికి బీబీ స్పెషల్‌కు రూ.7,471 ధరను చెల్లించి దీనికి రూ.50 తగ్గింపుతో క్వింటాల్ పత్తికి మెక్ మోడ్‌కు రూ.7,421 చొప్పున నేటి నుంచి అమల్లోకి వస్తుందన్నారు.



బొంరాస్‌పేట్: వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



పూడూరు: ప్రకాశ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

బొంరాస్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో బొంరాస్‌పేట్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం వికారాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అబ్బాస్, హారతి, రక్షిత, శైలజ ఉత్తమ ప్రదర్శన చేశారని సైన్స్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు.

జీవశాస్త్రం టాలెంట్ టెస్టులో...

దోమ: జీవశాస్త్రం టాలెంట్ టెస్టులో దోమలోని జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తెలుగు మీడియంలో శ్రీకాంత్, ఇంగ్లీష్ మీడియంలో హరీశ్, దాదాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన వైష్ణవి బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జీవశాస్త్రం ఫోరం అధ్యక్షుడు బుచ్చిలింగం, హెచ్ఎం జహంగీర్, టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరీక్షకు విద్యార్థి ఎంపిక

పూడూరు: జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలో పూడూరు మండల విద్యార్థి రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. కంకల్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.ప్రకాశ్ జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ బుయ్యని సంధ్యారాణి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం కుర్వగూడలో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పోటీపడాలి



మందులు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్

కడ్తాల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీ పడాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. ముద్విన్‌లో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాడ్గుల పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డిలతో కలిసి వెంకటేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. 330 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి దిగుబడులు సాధించాలని రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ జి. జ్యోతి, డాక్టర్ ప్రవీణ్ సూచించారు. కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చేవెళ్ల మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో రైతులకు ఉద్యాన సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టగొడుగులు, మిద్దె పంటలు, పెరటి తోటల పెంపకంపై తదితర రైతులు సాగు చేసేందుకు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణిమ మిశ్రా, పశువైద్యురాలు శిరీష, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కళాశాల విద్యార్థులు పవన్, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీవన్‌రెడ్డి, శివసాయి, రాజు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత, సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. సైబర్ నేరాల నివారణకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వ్యవస్థను రూపొందించినా నేరాలు తగ్గడం లేదన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ఉండాలంటే మన అప్రమత్తతే ముఖ్యం అన్నారు. ఫోన్లు, ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయాల్లో జాగరూకతతతో వ్యవహరించాలన్నారు. పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఇతర సమాచారాన్ని ఎవరికీ తెలపవద్దన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సైబర్ నేరాలపై అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, పోలీసు అధికారులు సుధీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్.ఆంజేయులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చైర్మన్‌గా అవకాశం కల్పించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కులకచర్లలో పశువుల సంత ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, పాండురంగ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, నాయకులు భరత్‌కుమార్, గోపాల్‌నాయక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పాదుకల ఊరేగింపు



మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి అయోధ్యకు తీసుకువెళ్తున్న శ్రీరాముడి పాదుకలు బుధవారం మేడ్చల్ పట్టణం అత్వెల్లికి చేరుకున్నాయి. భక్తులు స్వామి వారి పాదుకలకు స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. శివాలయంలో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

టీడీపీ పునర్‌వైభవానికి కార్యకర్తలు కృషిచేయాలి



టీడీపీ సభ్యత్వ నమోదు యాప్‌ను చూపుతున్న వెంకటేశ్, కార్యకర్తలు

కీసర రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చేలా ప్రతీ కార్యకర్త కృషిచేయాలని మేడ్చల్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు సుంకరి వెంకటేశ్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలో పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల పార్టీ టీడీపీ అన్నారు. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తెచ్చిన సంస్కరణలు, చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఇప్పటికీ ఎంతో మంది పార్టీ అభిమానులున్నారని తెలిపారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందాలని, వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సహజ మరణం పొందిన కార్యకర్త కుటుంబానికి పార్టీ రూ.2లక్షలిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పార్టీ అధ్యక్షులు కొండా జంగారెడ్డి, కృష్ణారావు, బ్రహ్మయ్యచౌదరి, జంగాలచారి, చంద్రయ్య, దేవాచారి, మహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు



ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

కొడంగల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో భూ సమస్యలపై దరఖాస్తులను, ధరణి రికార్డులను పరిశీలించారు. ఏ దరఖాస్తు అయినా పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లను వెంటవెంటనే జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు బెల్టు దుకాణాలు సీజ్



కడ్తాల్‌లోని కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడ్తాల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో 4 ఎస్సైలు 47 మంది సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. కిరాణా దుకాణాలు, ఫామ్‌హౌస్‌లు, పాన్‌షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాలుగు బెల్టు దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై 52 వాహనాలను తనిఖీ చేశారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. పాన్ షాపుల్లో, కిరాణాదుకాణాల్లో నిషేధిత గుట్కా విక్రయిస్తే చట్టపరంగా కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. రహదారిపై, పలు వార్డుల్లో పెద్దఎత్తున పోలీసులను మోహరించి తనిఖీలు చేపట్టారు.

తిరుమల చరిత్ర లోకానికి తెలియాలి



సౌందరరాజన్‌కు పుస్తకం అందజేస్తున్న ఎంవీఆర్ శాస్త్రి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చెప్పని తిరుమల చరిత్ర లోకానికి తెలియాల్సిన అవసరం ఉందని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. దేవుడున్నాడు జాగ్రత్త అనే పుస్తకాన్ని పుస్తక రచయిత ఎంవీఆర్ శాస్త్రి బుధవారం సాయంత్రం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌందరరాజన్‌కు అందజేశారు. ఈ పుస్తకాన్ని మొదటగా తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. రంగరాజన్ మాట్లాడుతూ తిరుమల చరిత్రపై పుస్తకాన్ని రాయడం, తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరులో మొదటి పుస్తకాన్ని అందజేయడం శుభ పరిణామమన్నారు. దేవాలయాలపై రచించిన పుస్తకాలను పఠిస్తే ఆధ్యాత్మికత పెంపొందుతుందన్నారు.

49వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 49వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్‌చైర్మన్ శరత్ చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. జేఏసీ నాయకులు ఆంజనేయులుగౌడ్, బాస్కర్ నాయక్, రామునాయక్, శేషన్‌నాయక్, వెంకటయ్య, నరహరి, శ్రీను, రంజిత్, రమేశ్, శరత్, సత్తిరెడ్డి, చంద్రయ్య, రాములుగౌడ్, మల్లయ్య, అంజయ్య సురేశ్,రాములు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి




మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల/షాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ నాయకులు మంత్రి శ్రీధర్ బాబును కోరారు. ఈమేరకు బుధవారం నగరంలో ఉన్న మంత్రి నివాసానికి వెళ్లి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, రవీంద్రచారి, పానుగంటి పర్వతాలు, రామకృష్ణ, చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చందు యాదవ్, సుధాకర్‌గౌడ్, మండల మహిళా నాయకురాలు లక్ష్మి, షాబాద్ మండల కార్యదర్శి రామకృష్ణ మంత్రిని కలిశారు.

ఇళ్ల సర్వేకు నెట్ ఇబ్బందులు

నెట్‌వర్క్, సర్వీస్ సమస్యతో ఆరు గ్రామాల్లో సర్వే ఆలస్యం

తాండూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం గ్రామాల్లో సర్వే చేస్తోంది. ఈ నెల 31వ తేదీకల్లా ఇళ్ల లబ్ధిదారుల నివేదికను ఇవ్వాలని మండల పరిషత్ అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. సర్వేను మండల పరిధి 33 పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాల్లో రెండు రోజుల క్రితం ప్రారంభించారు. బుధవారం అంతారంలో కార్యదర్శి సత్యనారాయణరెడ్డి సర్వే చేపట్టగా ఇంటర్నెట్ లేక అప్‌లోడ్ చేయలేకపోయారు. మండలంలో ఇప్పటి వరకు 108 కుటుంబాల సర్వేనే పూర్తయింది. అంతారం, ఓగీపూర్, చెంగోల్, గుండ్లమడుగుతండా, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, గోనూరు గ్రామాల్లో కార్యదర్శులు మొబైల్ యాప్ ద్వారా సర్వే ప్రారంభించగా ఇంటర్నెట్ సమస్య తలెత్తుతుంది. రోజూ ప్రతీ గ్రామంలో 30 కుటుంబాలను సర్వేచేసి యాప్‌లో నమోదు చేయాలని అధికారులు సెక్రటరీలను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను పంచాయతీ కార్యదర్శులే తేల్చాలని సూచించడంతో తమకు ఇది తలనొప్పిగా మారిందని వారు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే సరిహద్దు గ్రామాల్లో మొబైల్ నెట్‌వర్క్ ఉండక సర్వర్ డౌన్‌లోడ్‌కాక రోజుకు 8 నుంచి 10 కుటుంబాలనే సర్వే చేయగలుగుతున్నామని కార్యదర్శులు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో సర్వేకు ఇంటర్నెట్ సమస్య తలెత్తుతోందని కార్యదర్శులు వాపోతున్నారు.



అంతారంలో ఇందిరమ్మ ఇళ్లపై సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

ఆక్రమణదారులపై పీడీ యాక్ట్!

- హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు తర్వాత చర్యలు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు 2024 జూలై కటాఫ్
- ఆ లోపు నిర్మించి, నివాసమున్న భవనాలపై చర్యలుండవు
- ఆ తర్వాత చేపట్టిన నిర్మాణాలేవైనా అక్రమమైతే కూల్చివేతే
- నివాసేతర నిర్మాణాలు ఎప్పటివైనా తొలగిస్తాం
- మూసీలో మట్టి పోస్తోన్న సంస్థలపై పోలీసులకు ఫిర్యాదు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో పద్ధతి మార్చుకోని వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు అనంతరం ఈ దిశగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. హైడ్రా చర్యలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. సంస్థ విధివిధానాలు, పరిధిని వివరిస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటైందని.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దానినే కటాఫ్ తేదీగా పెట్టుకున్నామని తెలిపారు. హైడ్రా ఏర్పాటుకు ముందు అంటే జూలైకి మునుపు... చెరువుల ఎఫ్‌టీఎల్, పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అనుమతులతో నిర్మించి, ప్రజలు నివాసముంటున్న నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. భవన నిర్మాణం ఎప్పుడు జరిగిందనేది గూగుల్ ఎర్త్, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా గుర్తిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మించిన వ్యాపార, వాణిజ్య వినియోగ భవనాలకు ఈ కటాఫ్ తేదీ వర్తించదన్నారు. గతంలో అనుమతులిచ్చి.. అనంతరం పర్మిషన్ రద్దు చేసిన పక్షంలో ఆ నిర్మాణాలు నివాసాలైనా.. వాటిని అక్రమ కట్టడాలుగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, హైడ్రా ఏర్పాటు తర్వాత ప్రజలకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంశాలపై కొంత అవగాహన వచ్చిన నేపథ్యంలో జూలై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని వివరించారు. అనుమతి ఉన్నా, లేకున్నా.. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నివాసేతర నిర్మాణాలు(ఎన్- కన్వెన్షన్ వంటివి) ఎప్పుడు నిర్మించినా చర్యలుంటాయని రంగనాథ్ వివరించారు. ఇక, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.

ఆ సంస్థలపై ఫిర్యాదు..

నార్సింగ్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో మూసీని ఆక్రమిస్తోన్న రాజ్‌పుష్ప, ఆదిత్య బిల్డర్స్ తదితర సంస్థలపై స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మూసీలో పోసిన మట్టిని, ఇప్పటికే కట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆయా సంస్థలను ఆదేశించామని చెప్పారు. మూసీలో అక్రమంగా జరుగుతున్న మట్టి డంపింగ్‌ను అడ్డుకునేందుకు హైడ్రా బృందాలు రాత్రి వేళల్లో గస్తీ కాస్తున్నాయని చెప్పారు. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత చెరువుల ఎఫ్‌టీఎల్, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా తప్పుడు సమాచారంతో అనుమతులు తెచ్చుకున్నట్టు తేలితే.. ఆయా అనుమతులు రద్దుకు సంబంధిత శాఖలకు సిఫారసు చేస్తామన్నారు. ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన 5వేల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాయని చెప్పారు. ఆక్రమణదారులు ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

శివారుల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు

జీహెచ్‌ఎంసీ అవతల 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేత అధికారాన్ని ప్రభుత్వం హైడ్రాకు ఇచ్చిందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, అక్రమ కట్టడాలపై దృష్టి సారించామని చెప్పారు. ఆయా నిర్మాణాల నియంత్రణకు చర్యలు తీసుకోని స్థానిక సంస్థల అధికారులపై చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణమైనా.. ప్రజలు నివాసముండని వాటిపైనే చర్యలుంటాయని అన్నారు. వ్యక్తిగత ప్లాట్లలో(స్థలాల్లో)ని అక్రమ నిర్మాణాలనూ హైడ్రా కూల్చివేస్తుందని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇక, గత ఐదు నెలల్లో హైడ్రా చేపట్టిన చర్యలతో సుమారు 200 ఎకరాల చెరువు, పార్కులు, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు. 12 చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు.

ఆర్పీల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెప్మా రిసోర్స్ పర్సన్ల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ హెచ్చరించాడు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతూ.. హరితహారం, పట్టణ/పల్లె ప్రగతి, తడి/పొడి చెత్త సేకరణ, డబుల్ బెడ్ రూమ్ సర్వే, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలిప్పించడం, స్త్రీనిధి ఇలా అనేక రకాల సేవలందిస్తున్న ఆర్పీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీతం నెలకు రూ.6వేలే ఇచ్చి చేతులు దులుపుకుంటోందన్నారు. వేతనం రూ.26వేలు, ఆర్పీలందరికి రూ.10లక్షల బీమా, డ్రెస్‌కోడ్, ఐడీ కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం ఆర్పీల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎన్.బాలమణి, కార్యదర్శి సీహెచ్.నంద, ఉపాధ్యక్షులు ఎమ్.లక్ష్మి, వి.కవిత, సహాయ కార్యదర్శులు వినోద, పి.జ్యోతి, కోశాధికారిగా ఎన్.సునీత ఎన్నికయ్యారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ఎం.సంతోష్ అన్నారు. బుధవారం పరిగి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబరు ప్లేట్లు లేని 35వాహనాలకు జరిమానాను విధించారు. ప్రతి వాహనానికి ఆర్సీ ఫిట్‌నెస్, బీమా తప్పకుండా ఉండాలని సూచించారు. నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బొంరాస్‌పేట్ జట్టు

బొంరాస్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో బుధవారం జరిగిన సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. మండలానికి చెందిన శ్రీశైలం, నర్సిములు, అశోక్, అఖిలేశ్, రాహుల్, ప్రభాకర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లాస్థాయి పోటీల్లో తాండూర్ మండల జట్టుతో బొంరాస్‌పేట్ జట్టు తలపడి గెలిచింది.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):పేదల కోసం పలు ప్రైవేటు సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ భవానీరాఘువేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం జీవీకే అంజు ఐ కేర్ సంస్థ నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందిస్తున్న ప్రైవేట్ సంస్థల సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. పరీక్షలు నిర్వహించిన అవసరమయ్యే శస్త్ర చికిత్సలకు జీవీకే అంజు ఐ కేర్ సంస్థ 20శాతం రాయితీ కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీవీకే అంజు ఐ కేర్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ భవానీ

జీపీ వర్కర్లను అరెస్టు చేయడం విడ్డూరం



ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఎంపీవో గీతకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో పాటు గ్రామ పంచాయతీ వర్కర్లకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక ఎందుకు నెరవేర్చడం లేదన్నారు. తమ సమస్యను పరిష్కారించాలని కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపడితే పోలీసులు ఎందుకు అరెస్టు చేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం నాయకులు కె.బాల్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

యాచారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను దక్కించుకునేందుకు కార్యకర్తలు చొరవ తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు దేరంగుల రాజు అన్నారు. బుధవారం నల్లవెల్లి గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు రాజు సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు శేఖర్, వినోద్‌కుమార్ తదితరులున్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

కేశంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ ప్రసవం కోసం కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. లో బీపీ ఉండటంతో 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రవవించింది. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన కొండగాళ్ల శ్రీకాంత్ భార్య మౌనిక మంగళవారం రాత్రి ప్రసవం కోసం కేశంపేట పీహెచ్‌సీలో చేరింది. రాత్రి ఒంటి గంట సమయంలో మౌనికకు బీపీ తగ్గింది. పరిస్థితిని గమనించిన ఆసుపత్రి సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్‌లు హుటాహుటిన కేశంపేట ఆసుపత్రికి చేరుకున్నారు. మౌనికను అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా రాత్రి 1.30 గంటల సమయంలో మార్గమధ్యలో వేముల్‌నర్వ వద్ద పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ ఆమెకు ప్రసవం చేశారు. మౌనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త టీచర్లకు వేతనాలు ఇవ్వాలి



చేవెళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీయుటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్ పాషా మాట్లాడుతూ ఇటీవల విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల మండల శాఖ అధ్యక్షుడు దయానందం, శివానందం, శంకర్‌పల్లి మండల శాఖ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి



కృపశేఖర్, ఆదిత్యలను అభినందిస్తున్న పీఈటీ సత్తిరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని పీఈటీ సత్తిరెడ్డి కోరారు. తూంకుంట ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కృపశేఖర్, 8వ తరగతి విద్యార్థి ఆదిత్య జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికవగా బుధవారం పీఈటీ వారిని అభినందించారు. ఇటీవల తాండూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆదిత్య, కృపశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ఇద్దరు ఉమ్మడి జిల్లా నుంచి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహిస్తారు.ఈ విద్యార్థులను పాఠశాలలో ఎంఈఓ వసంత కుమారి, టీచర్లు, పీఈటీ అభినందించారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. క్రీడోత్సవాల సందర్భంగా ఆట, పోటీలను చైర్మన్ ప్రారంభించారు. విద్యార్థులకు బోధనతోపాటు కొంత సమయాన్ని క్రీడలకూ కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఉన్నత చదువులకు రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిత, జ్యోతి తదితరులు పాల్గొనారు.



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

ఎన్కేపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరం



యాలాల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్కేపల్లిలో ఒగ్గుడోలు శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి, నాందార్‌పూర్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఈ శిబిరం ప్రారంభం కాగా, 21రోజులు కొనసాగనుంది. రోజూ పది గంటలపాటు శిక్షణ ఇస్తారు. శిబిరంలో పాల్గొనేందుకు వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పించింది. శిక్షకులు శివకుమార్, రాఘవేందర్, ఒగ్గు మల్లేష్ పాల్గొనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, శంకర్, ఆలయ ధర్మకర్త, పూజారి కిష్టప్ప, మాజీ జడ్పీటీసీ మంజులవెంకటేశం, జిల్లా ఒగ్గుబీర్ల సంఘం అధ్యక్షుడు, పూజారి శాంతప్ప పాల్గొన్నారు.

మూలనపడిన 'చెత్త' వాహనాలు

- అంతా మున్సిపాలిటీనే చూసుకోవాలంటున్న పాత జీపీ ఆఫీసు అధికారులు, సిబ్బంది
- అయోమయంలో విలీన పంచాయతీ వాసులు
- రోజూ ఇబ్బందులతో సతమతం
- కీసర సమస్యలపై పట్టించుకునేదెవరు?


కీసర వార్డు కార్యాలయం వద్ద ఉంచిన చెత్త సేకరణ ఆటోలో డంప్ చేస్తున్నారిలా

కీసర, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి చెత్త సేకరించేందుకు వినియోగించే ఆటోలకు, ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించక మూలనపడ్డాయి. అధికారుల నిర్లక్ష్యంతో దాతలు లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీకి ఆటోలు, ట్రాక్టర్‌ను విరాళంగా ఇస్తే, అవి వృథాగా పడి ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసరలో చెత్త సేకరణకు దాతలు నాలుగు ఆటోలు, ఓ ట్రాక్టర్‌ను విరాళంగా అందజేశారు. కొన్ని నెలలుగా రెండు ఆటోలు, ట్రాక్టర్ చెడిపోయి వార్డు కార్యాలయం వద్ద మూలకుపడ్డాయి. కార్యాలయానికొచ్చే అధికారులు గానీ, మున్సిపల్ కమిషనర్ గానీ వాటికి రిపేర్ చేయించడం లేదు. మూలకు పడ్డ ఆటోలో స్థానికులు చెత్త వేస్తున్నారు. దీంతో వాహనం పూర్తిగా పాడవుతోంది. అలాగే కార్యాలయం వద్ద పారిశుధ్యం లోపిస్తోంది. ఆటోలు తుప్పుపట్టిపోతున్నాయి.

పట్టించుకోని పాత పంచాయతీ అధికారులు

చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతులే చేయించలేని అధికారులు ఇక ప్రజలకేం చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే అధికారులు, ఇలా ప్రజోపయోగ వాహనాలను పట్టించుకోకుండా ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని అంటున్నారు. కీసర సమస్యలపై ఎవరికి విన్నవించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని, కార్యాలయ అధికారులకు సమస్యలను చెబితే మాకే సంబంధం లేదని, అంతా మున్సిపల్ కార్యాలయమే చూసుకుందని అంటున్నారని వాపోతున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులే చూసుకుంటే మరి మీరేం చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మేము కేవలం సర్వేలు, ఉన్నతాధికారులు చెప్పిన పనులను పర్యవేక్షించేందుకే ఉన్నామని, సమస్యలు పరిష్కరించే అధికారం మాకు లేదని పాత పంచాయతీ అధికారులు, సిబ్బంది ఖరాకండీగా చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులే విలీన పంచాయతీ సమస్యలను పరిష్కరించాలని, కీసరలో పనిచేయని ఆటోలకు, ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వార్డు కార్యాలయం ముందు వృథాగా ఉన్న ట్రాక్టర్

18వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, డిసెంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వే వంతెనను త్వరిత గతిన పూర్తి చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంతో 18వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో టీడీపీ మండల నాయకులు కూర్చున్నారు. వంతెన నిర్మాణ పూర్తికాక నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పనులు పూర్తి చేసి ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర నాయకుడు బక్కని నర్సింహులు, ఇతర నాయకులు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు కందికంటి అశోక్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన

దోమ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దోమ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బృందం అలిముద్దీన్, పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులు, మహిళలను మోసగాళ్లు మాయమాటలతో ప్రలోభాలకు గురిచేసి అక్రమ రవాణాతో ముంబాయి, ఢిల్లీ వంటి నగరాలకు పంపిస్తున్నారని పేర్కొన్నారు. వారి పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది భీమ్‌రెడ్డి, హెచ్ఎం ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి


చంద్రాయన్‌పల్లి కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం చంద్రాయన్‌పల్లి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంట సామగ్రి, బియ్యాన్ని పరిశీలించారు. కిచెన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. భోజన నాణ్యతలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్పల్లి: తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఎస్సై సురేశ్ మర్పల్లిలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. భోజనం ఉందని బాలికలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనంచేశారు. ఫుడ్ నాణ్యంగా ఉండాలన్నారు.

దౌల్తాబాద్: తహసీల్దార్ గాయత్రి దౌల్తాబాద్‌లోని కేజీబీవీ తనిఖీ చేశారు. భోజనం, వంట సామగ్రి, బియ్యం ఇతర వస్తువులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

బషీరాబాద్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని తహసీల్దార్ వై. వెంకటేష్ నిర్వాహకులకు చెప్పారు. నవాల్గలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించి జీహెచ్ఎం జగదీశ్వర్‌తో మాట్లాడారు. పిల్లల భోజనాన్ని టీచర్లు రోజూ పరిశీలించాలన్నారు. బియ్యం బాగాలేకుంటే వెంటనే వేరే బియ్యాన్ని తెప్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్నే పెట్టాలని సూచించారు.

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. జెడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ పాఠశాలలో గతంలో మాదిరిగా టెన్త్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మర్పల్లి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ మునీరుద్దీన్, తదితరులు


అన్నోజిగూడ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలి


దౌల్తాబాద్: ఊరకుంటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

దౌల్తాబాద్/బొంరాస్‌పేట్/కులకచర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని ఊరగుంట, గోకఫస్లాబాద్ గ్రామాల్లో ఇళ్ల సర్వేను పరిశీలించారు. ప్రభుత్వ యాప్‌లో వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇళ్ల సర్వేను బొంరాస్‌పేట్ మండల అధికారులు ప్రారంభించారు. ఏర్పుమళ్లలో సర్వే నిర్వహించగా రేగడిమైలారంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీవో వెంకన్నగౌడ్, అధికారులు పాల్గొన్నారు. మెట్లకుంటలో ఇళ్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, నర్సిములు నాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కులకచర్ల మండలం పీరంపల్లిలో ఎంపీడీవో రామకృష్ణ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.


కులకచర్ల మండలం పీరంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పరిగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 90 రోజుల ప్రణాళికను అమలుచేయాలని జిల్లా ఇంటర్ బోర్డు అధికారి శంకర్‌నాయక్ సూచించారు. బుధవారం పరిగిలోని ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. 90 రోజుల ప్రణాళికలో అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. సెలవులతో సంబంధం లేకుండా రోజూ ఇంటి వద్ద చదువుకునే ప్రణాళిక కళాశాలలో జరిగే రివిజన్ ఆధారంగా పాటించాలన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి అభినందనీయం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో వచ్చిన లాభాల్లో సామాజిక సేవ కార్యక్రమాల కోసం ఖర్చు పెట్టడం అభినందనీయమని మేడ్చల్ మాజీ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అన్నారు. డబిల్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఫ్లోరిన్ టైల్స్ ఏర్పాటుకు అడ్వాంటా ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ రూ.9లక్షల సీఆర్ఎస్ నిధులు ఇచ్చింది. దీంతో బుధవారం పనులను ప్రారంభించారు. రజిత మాట్లాడుతూ... వ్యాపారాల్లో లాభాలు గడించే వారు విద్యార్థుల కోసం ఫ్లోరింగ్ టైల్స్ ఏర్పాటుకు విరాళం అందజేయటం అభినందనీయమన్నారు. అలాగే పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక సమస్యల పరిష్కారానికి విరాళాలు ఇవ్వాలని కోరారు. మాజీ సర్పంచ్ గీతభాగ్యరెడ్డి మాట్లాడుతూ... పాఠశాలలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే అడ్వంటా ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ ఆర్థికసాయం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు భాగ్యారెడ్డి, అడ్వంటా ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు వెంకటరఘురామ్, రణిత, రమేష్, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న అడ్వంటా కంపెనీ ప్రతినిధులు

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంఈవో

దోమ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదన్‌రావుపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంఈవో వెంకట్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో రాజ్‌భవన్'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


కీసర: రాజ్‌భవన్‌కు వెళ్లిన కీసర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కీసర/ఘట్‌కేసర్/శామీర్‌పేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ పిలుపు మేరకు కీసర కాంగ్రెస్ నేతలు చలో రాజ్ భవన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అదానీ విషయంలో కేంద్రం అవలంబిస్తున్న తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ చలో రాజ్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డిల అధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు రాజ్‌భవన్‌కు తరలివెళ్లాయి. జూపల్లి రవీందర్, దాసరి పవన్‌గౌడ్, సరిత వెంకటేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. అదానీ అవినీతి వ్యవహారంపై ప్రధాని మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ డిమాండ్ చేసారు. చలో రాజ్ భవన్ కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బస్సుల్లో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల నుంచి నాయకులు, కార్యకర్తలు ఓఆర్ఆర్ మీదుగా నగరానికి చేరారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావణి, నాయకులు మహేష్‌గౌడ్, రాధాక్రిష్ణ, కొంతం అంజిరెడ్డి, నాగరాజు, ముత్యాలుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గణేష్ ఉన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట కాంగ్రెస్ నాయకులు చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొని ఆందోళన చేశారు. కార్యక్రమానికి తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెల్లి రాజ్‌భవన్ వద్ద అదానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు.



ఘట్‌కేసర్ నుంచి రాజ్‌భవన్‌కు తరలుతున్న కాంగ్రెస్ నాయకులు

పేదల ఆకలి తెలిసిన సీఎం.. రేవంత్‌రెడ్డి


బొంరాస్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌లో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తెలిసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా, సీఎంగా ఉండటం అదృష్టమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక చొరవతో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. బుధవారం బొంరాస్‌పేట్ ఉమ్మడి మండలం మెట్లకుంట, తుంకిమెట్ల, ఏర్పుమళ్ల పాఠశాలల్లో టిఫిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేదల కష్టాలు తెలిసిన సీఎంగా ఎవరికీ ఇబ్బంది కలగకూడదనే విద్యార్థులకు అల్పాహారాన్ని పెడుతున్నామని తెలిపారు. దీంతో ఉదయం పూట తల్లిదండ్రులకు వంటబాధ తప్పుతుందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, దేశ్యా, కృష్ణ, నర్సిములు, ఎంఈవో హరిలాల్ పాల్గొన్నారు.

ఏర్పుమళ్ల స్కూలుకు త్వరలో మినీ గ్రంథాలయం

ఏర్పుమళ్ల యూపీఎస్‌కు త్వరలో మినీ గ్రంథాలయాన్ని మంజూరు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి తెలిపారు. అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. గ్రామ నాయకుడు అంజిల్‌రెడ్డి కోరిక మేరకు త్వరలో పాఠశాల, గ్రామ యువత చదువుకునేందుకు మినీ గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

నిప్పంటుకొని మహిళ మృతి

మూడుచింతలపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన సంఘటన శామీర్‌పేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నాల గ్రామానికి చెందిన ఉదరి భాగ్య(40) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త పని నిమిత్తం 15రోజుల క్రితం కరీంనగర్ వెళ్లాడు. భాగ్యకు మద్యం తాగే అలవాటుంది. విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ఇంటి కరెంట్ కనెక్షన్ కట్‌చేశారు. మంగళవారం రాత్రి ఆమె మద్యం తాగి క్యాండిల్ వెలిగించుకొని నిద్రపోయింది. దుప్పటికి క్యాండిల్ మంటలంటుకొని భాగ్య మంటల్లో చిక్కుకుంది. సమయంలో ఇంట్లో పిల్లలు లేరు. ఈ ప్రమాదంలో భాగ్య మృతిచెందింది. ఇంట్లో నుంచి పొగను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


పోలీసులు సీజ్ చేసిన టెంట్ హౌస్ సామగ్రి

తాండూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుల్ని అరెస్టు చేశామని బుధవారం కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షాదుల్లా గత సెప్టెంబరు 29న ఫిరోజ్, ఖయ్యూం, అక్బర్, జబ్బు, సాబెర్‌లతో కలిసి అల్లాపూర్‌గేటు వద్ద ఓ షాపులో విద్యుత్ పరికరాల చోరీకి పాల్పడ్డారు. అదే నెల 24న శంకర్‌పల్లిలోని పర్వేదా టెంట్ హౌస్‌లో వంట సామగ్రిని దొంగిలించి విక్రయించుకున్నారు. కేసు నమోదు చేసిన విచారణ చేయగా షాదుల్లా దొరికాడని చెప్పారు. అతడి వద్ద కొంత వంట సామగ్రిని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ఈ కేసులో అస్లాం, సాబేర్‌లను గతంలోనే జైలుకు పంపగా.. షాదుల్లాను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలో కాశీవిశ్వనాథ్ టీ స్టాల్ నడుపుతున్నాడు. టీ స్టాల్‌లో గంజాయి చాకెట్లను అమ్ముతున్న సమాచారం తెలుసుకున్న ఎస్వోటీ పోలీసు లు దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బిహార్‌కు చెందిన రామ్‌నారాయణ్, కిషోర్‌కుమార్ టీకొట్టు ముసుగులో కాలేజీ విద్యార్థులకు చాక్లెట్లు విక్రయిస్తున్నారు. వారి నుంచి కిలో(230) చాక్లెట్లు స్వాధీనం చేసుకొని రిమండ్‌కు తరలించి కేస్తు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంది పంట దగ్ధం

దోమ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఊటుపల్లి గ్రామానికి చెందిన బండి నర్సయ్య మూడెకరాల కంది పంట మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంతో దగ్ధమైంది. పంట దగ్ధం కావడంతో రూ.2లక్షల నష్టంజరిగిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం తనకు ఆర్థిక సహాయం అందించాలని కోరాడు.

బార్‌లో అక్రమ మద్యం సీజ్


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బార్‌లో అక్రమంగా విక్రయిస్తున్న రూ.1.05లక్షల విలువైన 35సీసాల మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకుని బార్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఎస్‌టీఎఫ్ బి-టీమ్ సీఐ సుభాష్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ శాఖ పరిధి ఎమ్ఎస్ హార్ట్‌కప్ కేఫ్ రెస్టారెంట్ అండ్ బార్‌లో వైన్‌షాపులకు కేటాయించిన మద్యం అక్రమంగా అమ్ముతున్నారన్నారు. బుధవారం రాత్రి దాడులు నిర్వహించి 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వైన్స్‌లో అమ్మాల్సిన మద్యాన్ని తక్కువ ధరకు కొని బార్లలో విక్రయించటం నేరం అన్నారు. సదరు బార్ నిర్వాహకులపై కేసు నమోదుచేసి మద్యం బాటిళ్లను సీజ్ చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి


నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఓటరు నమోదుకు నాయకులు సహకరించాలని కోరారు. యువత 18ఏళ్లు నిండిన వారంతా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సర్పన్‌పల్లి చెరువు.. అక్రమాలకు అడ్డా!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుంటూ నాశనం చేస్తున్నారు. స్థానిక నాయకుల అండదండలతో ఎక్కడి నుంచో వచ్చిన ఓ వ్యాపారి లావణీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా క్యాంపు సైట్ పేరుతో రిసార్ట్స్ నడిపిస్తున్నాడు. అలాగే చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన వండర్‌నెస్ రిసార్ట్స్ బయటకు మాత్రం ఆర్గానిక్ ఫామింగ్ చేస్తున్నామని చెబుతూ లోపల మాత్రం అశ్లీలతకు అడ్డాగా మార్చుకున్నారు. శని, ఆదివారాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇక్కడికొచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే చెరువు మధ్యలో బోటింగ్ కట్టడాలు నిర్మించి కస్టమర్లను ఆకట్టుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఐదు సంవత్సరాలుగా అక్రమార్కుల చెరలో ఇరుకున్న ఈ చెరువును విడిపించేందుకు అధికారులు సైతం ఎవరూ ముందుకు రావడం లేదంటూ సమీప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలతో చెలగాటం

వీటికి తోడు చెరువు నీటిని సైతం దొంగిలించి సొమ్ము చేసకుంటున్నారు. చెరువులోకి వచ్చే నీటి కాల్వలకు అడ్డుకట్టలు వేసి నీటిని తరలిస్తున్నారు. నైట్ క్యాపింగ్ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రాత్రి సమయంలో డీజే సౌండ్‌లతో స్థానిక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొన్ని రిసార్ట్స్‌లలో రాత్రి పూట అడవి జంతువుల వేలం కూడా చేస్తున్నారు. అలాగే చుట్టు ఉన్న రిసార్ట్స్‌లో అడ్వెంచర్ గేములు ఆడిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గతంలో ఈ రిసార్ట్స్‌ల పరిధిలో ఒకరు బావిలో పడి మృతిచెందగా, మరో వ్యక్తి బైక్ రైడింగ్ చేస్తూ బోల్తా పడి చనిపోయాడు. అయినా అక్కడ ఇలాంటి అడ్వెంచర్ గేములు ఆపడం లేదు.

అటువైపు చూడని అధికారులు

గతంలో ఆంధ్రజ్యోతితో అసైన్డ్‌భూముల్లో అక్రమ కట్టడాలు అనే శీర్షికన వచ్చిన కథనానికి వికారాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన రవీందర్ చర్యలు తీసుకునే ప్రయత్నం చేయడంతో అతన్ని అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించారు. అప్పటి నుంచి అటువైపు వెళ్లేందుకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు సైతం చెరువులో అక్రమంగా బోటింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

సంక్షిప్తంగా..

- **వికారాబాద్:** సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ధారూరు, మోమిన్‌పేట మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ.. సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించి పే స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ తరువాత కూడా వారికి ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, నాగేశ్వర్, ప్రభు, రాందాస్, సురేష్, బాబయ్య, నరేష్, మాణిక్యం, శివాని, మల్లికార్జున్ పాల్గొన్నారు.
- **మేడ్చల్ ప్రతినిధి:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరింది. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఖమ్మం జిల్లాలో గుండెపోటుతో మృతిచెందిన సమగ్ర శిక్ష ఉద్యోగికి జేఏసీ ఆధ్వర్యంలో మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.
- **పెద్దేముల్:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్దేముల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, అలాగే ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అంబరప్ప, కార్మికులు నర్సిములు, చంద్రప్ప, వెంకటమ్మ, లాలప్పలు తదితరులు పాల్గొన్నారు.
- **తాండూరు:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే సహించేది లేదని మాల సంఘాల నాయకులు హెచ్చరించారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 19న(నేడు) అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా లక్ష మందితో అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణను సహించబోమన్నారు. సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. అది తీర్పు కాదని, సూచన మాత్రమేనని వారు పేర్కొన్నారు. సమావేశంలో మాల సంఘం ప్రతినిధులు కిష్టయ్య, మల్లప్ప, హనుమంతు, జగదీష్, ఎల్లప్ప, రాములు, శేఖర్, శ్రీనివాస్, అంజిలప్ప, కాశప్ప, కృష్ణ, నరేష్ తదితరులు ఉన్నారు.
- **పరిగి:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు హలో మాల.. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య కోరారు. మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.
- **తాండూరు:** తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిగింది. తాండూరు పట్టణం రాఘవేంద్ర కాలనీలోని రోహిత్‌రెడ్డి నివాసంలో పూజ మండపాన్ని అలంకరించారు. అయ్యప్ప స్వాములు ఆటపాటలు, భజనలు, సంకీర్తనలు, అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. రోహిత్‌రెడ్డి అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకం, మెట్లపూజ చేశారు.